నిర్యాణం

స్ఫూర్తి ప్రదాతలు

అమ్మమ్మ - తాతయ్య
తనుబుద్దు పెద బసివిరెడ్డి
వెంకట సుబ్బమ్మ

తల్లిదండ్రులు
దేవగిరి వెంకట సుబ్బారెడ్డి
కోటమ్మ

మేనత్త
శ్యామల రత్తమ్మ

నాయనమ్మ- తాతయ్య
దేవగిరి వెంకటరత్నం
మహాలక్ష్మీ

అత్తమామలు
మోదుగుల రామిరెడ్డి
కోటమ్మ

స్ఫూర్తి సాగరం



కీ॥శే॥ మోదుగుల ఆదిలక్ష్మి గారు

జననం : 18-10-1942 మరణం : 09-05-2024

వికసిత వదనంతో ఆహ్వానించటం... మధురమైన మాటలతో పలకరించటం
ఆత్మీయ ఆతిధ్యంతో ఆదరించటం... మీకు పెట్టిన ఆభరణాలూ ఆదరణీయాలు !

మీ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్ధిస్తూ...

భర్త : మోదుగుల పాపిరెడ్డి న్యాయవాది

స్ఫూర్తిధారులు

పెద్ద తమ్ముడు
దేవగిరి రామలింగారెడ్డి
ఇందిరాదేవి

చిన్న తమ్ముడు
దేవగిరి రఘురామిరెడ్డి
లీలారెడ్డి

కుమారుడు - కోడలు
మోదుగుల వాసుదేవరెడ్డి - ఉదయ కుమారి

కుమారుడు - కోడలు
మోదుగుల వేణుగోపాలరెడ్డి - మాధవీకృష్ణ

కూతురు - అల్లుడు
ఆళ్ళ దాక్షాయణి - అయోధ్య రామిరెడ్డి MP

మనవడు, మనవరాలు
అఖిలాండేశ్వరి - యజ్ఞేష్ రెడ్డి
మోదుగుల కార్తీక్ రెడ్డి

మనవళ్ళు
మోదుగుల సాకేత్ రామిరెడ్డి
మోదుగుల ప్రణవ్ సుబ్బారెడ్డి

మనవళ్ళు, మనవరాళ్ళు
ఆళ్ళ శరణ్ - శ్రావ్య
ఆళ్ళ ఇషాన్

అంతిమయాత్ర : ది. 10-05-2024 శుక్రవారం ఉదయం10గం॥లకు
గుంటూరు, రెడ్డిపాలెంలోని వైకుంఠధామంలో నిర్వహించబడును

క్లుప్తంగా

తనిఖీల్లో రూ.20 లక్షలు స్వాధీనం



గుంటూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలో భాగంగా ఎఫ్ఎస్‌టీ టీం రూ.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న సంఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామ సమీపంలో ఒక కారు రోడ్డు పక్కన నిలిపి ఉందన్న సమాచారం మేరకు ఎఫ్ఎస్‌టీ టీం అక్కడికి చేరుకుని తనిఖీ చేయగా కారు డిక్కీలో అట్ట పెట్టెల్లో రూ.20 లక్షల నగదు ఉందని తెలిపారు. విజయవాడకు చెందిన వ్యక్తి తన కారులో నగదు తీసుకెళుతున్నాడని తెలిపారు. నగదుకు సంబంధించి ఎటువంటి సమాచారం, కారణాలను సదరు వ్యక్తి చెప్పక పోవటంతో కేసు నమోదు చేసి స్టేషన్‌కు తదుపరి చర్యల నిమిత్తం తరలించామన్నారు.

వేసవి ప్రత్యేక రైళ్లు



లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే ప్రయాణీకుల సౌకర్యార్థం గుంటూరు డివిజన్ మీదుగా కాచిగూడ – బరంపూర్ మీదుగా సమ్మర్ ప్రత్యేక రైళ్లు కేటాయించినట్లు గుంటూరు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం తెలిపారు. కాచిగూడ – బరంపూర్(07135) ప్రత్యేక రైలు ఈనెల 11న కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈరైలు కాచిగూడ మీదుగా రాత్రి 10.55 గంటలకు బయల్దేరి, బరంపూర్ స్టేషన్‌కు మరుసటి రోజు సాయంత్రం 5 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. బరంపూర్ – కాచిగూడ(07136) ఈనెల 12న బరంపూర్ నుంచి రాత్రి 10.35 గంటలకు బయల్దేరి, మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు కాచిగూడ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు మల్కాగ్జిరి, నల్గొండ, మిరియాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, యలమంచలి, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాసా, స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

జేవీకేతో రీవీగా బడికి

- పేద విద్యార్థుల చదువుల బాధ్యత తీసుకున్న సీఎం జగన్ ప్రభుత్వం
- జేవీకేలో పుస్తకాలు, నోట్సులు సహా 10 రకాల సామగ్రి అందజేత
- ప్రభుత్వ పాఠశాలల్లో పైసా ఖర్చు లేని ఉచిత విద్య
- జిల్లాలో గత నాలుగు విద్యాసంవత్సరాల్లో 5.21 లక్షల జేవీకే కిట్లు పంపిణీ
- నాలుగేళ్లలో రూ.95.96 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
- పాఠశాలలు తెరిచిన రోజే పండుగలా జేవీకే కిట్లు పంపిణీ
- నెలల తరబడి పాఠ్య పుస్తకాలే ఇవ్వని గత టీడీపీ ప్రభుత్వం

విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని పెంచిన జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్

మంచి కలర్‌ఫుల్ యూనిఫాం.. కొత్త బూట్లు, సాక్సులు, టై, బెల్టులతో, చక్కటి బ్యాగు భుజాన తగిలించుకుని ఇంట్లో బై చెప్పి.. హుషారుగా స్కూలుకు వెళ్తున్న విద్యార్థులు.. వీళ్ల ఏ కార్పొరేటో, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులనుకుంటే పొరపాటే.. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన ప్రభుత్వ విద్యావ్యవస్థకు మారిన పాఠశాలలు ప్రత్యక్ష ఉదాహరణ అయితే.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరో ఉదాహరణగా నిలుస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఎవరూ కలలో కూడా ఊహించని రీతిలో ప్రభుత్వ బడులు, విద్యాబోధన విధానం మారగా.. జేవీకే కిట్ల ద్వారా విద్యార్థులు సైతం పెరిగిన ఆత్మవిశ్వాసంతో హుందాగా పాఠశాలలకు వెళుతూ.. చక్కటి ప్రతిభ చూపుతూ.. మంచి ఫలితాలు సాధిస్తున్నారు.



జగనన్న విద్యాకానుక కిట్ సామగ్రి

గుంటూరు ఎడ్యుకేషన్: పేద, మధ్య తరగతి విద్యార్థులకు పైసా ఖర్చు లేని నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి పెద్ద దిక్కుగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పిల్లలను బడికి పంపేందుకు వెనుకాడుతున్న పేద కుటుంబాల తల్లిదండ్రులకు నేనున్నాను అనే భరోసా ఇస్తూ చదువుకునేందుకు అవసరమైన అన్ని రకాల సామగ్రిని ఉచితంగా ఇచ్చి పేద విద్యార్థుల పాలిట పెన్నిధిగా మారారు. పాఠశాలలు తెరిచిన తరువాత నెలల తరబడి పాఠ్య పుస్తకాలు అందని పరిస్థితులు, ఎప్పుడో ప్రభుత్వం దయచూపితే అరకొరగా పంపిణీ చేసే యూనిఫాంతో సరిపెట్టుకోవాల్సిన దశాబ్దాల చరిత్రను తిరగరాసిన వైఎస్ జగన్ ప్రభుత్వం పేద పిల్లలకు విద్యను హక్కుగా మార్చింది. జగనన్న విద్యాకానుక స్టూడెంట్ కిట్‌తో విద్యార్థుల తలరాతలు దిద్దింది.

జేవీకే కానుక కిట్ ఇదీ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నాణ్యమైన బ్రాండెడ్ నోటు పుస్తకాలతో పాటు మూడు జతల యూనిఫాం, బూట్లు, రెండు జతల సాక్సులు, టై, బెల్టు, ఆకర్షణీయమైన పుస్తకాల బ్యాగు, డిక్షనరీతో కూడిన కిట్‌ను ఉచితంగా ఇస్తూ ప్రభుత్వ విద్యను కార్పొరేట్‌స్థాయికి తీసుకెళ్లింది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు యూనిఫాం ధరించి, టై, బెల్టు పెట్టుకుని, బూట్లు వేసుకుని, బ్యాగుతో పాఠశాలకు హుందాగా వెళ్లే సామర్థ్యాన్ని వారికి ఇచ్చింది.

నాలుగేళ్లలో 5.21 లక్షల జేవీకే కిట్లు..

గత నాలుగు విద్యాసంవత్సరాల్లో 5.21 లక్షల జేవీకే కిట్లు పంపిణీ గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గత నాలుగు విద్యాసంవత్సరాల్లో 5,21,380 కిట్‌లను పంపిణీ చేసిన ప్రభుత్వం, రూ.95.96 కోట్లు వెచ్చించింది. గత నాలుగేళ్లుగా వరుసగా ప్రతి యేటా పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక కిట్ల పంపిణీని పండుగలా నిర్వహించింది. చదువుకునేందుకు అవసరమైన అన్ని రకాల సామగ్రిని ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం నుంచి ఉపశమనం కలిగించింది.



జిల్లాలో విద్యాకానుక కిట్ల పంపిణీ ఇలా...

ఏడాది	పాఠశాలలు	విద్యార్థులు	కిట్ ధర	వెచ్చించిన నిధులు
2020-21	1,140	1,31,366	రూ.1,350	రూ.17.73 కోట్లు
2021-22	1,164	1,37,713	రూ.1,667	రూ.22.96 కోట్లు
2022-23	1,133	1,35,871	రూ.1,996	రూ.27.12 కోట్లు
2023-24	1,106	1,16,430	రూ.2,418	రూ.28.15 కోట్లు

జగన్ మామయ్యే చదివిస్తున్నారు



మా నాన్న శామ్యేలు బేల్దార్ మేస్త్రిగా పని చేస్తున్నారు. వరుసగా నాలుగో సారి విద్యాకానుక కిట్ అందుకున్నాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంగ్లీష్ చదువులు చెప్పిస్తున్న సీఎం జగన్ మామయ్య మా చదువుల బాధ్యత తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన ఆశయాలను నెరవేర్చేవిధంగా చదువుతాం.

– సీహెచ్ ప్రవీణ్, 8వ తరగతి విద్యార్థి, గుంటూరు

అన్నా చెల్లెళ్లం ఒకే స్కూల్లో చదువుతున్నాం



నేను 8వ తరగతి, నా చెల్లెలు సౌమ్యలక్ష్మి 7వ తరగతిలోకి వచ్చాం. నాన్న శ్రీనివాసరావు ప్రైవేటు కంపెనీలో సేల్స్‌మేన్‌గా ఉద్యోగం చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మా పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి పర్చారు. పాఠశాల తెరిచిన రోజునే జేవీకే కిట్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. జగన్ మామయ్యకు కృతజ్ఞతలు

– ఎం.వెంకటసాయి మణికంఠ, సౌమ్యలక్ష్మి, గుంటూరు

మా మద్దతు అనిల్‌కే..!




ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌ను సత్కరించిన తెనాలి యాదవ నేతలు

తెనాలి: నరసరావుపేట ఎంపీ టికెట్‌ను తొలిసారిగా యాదవులకు కేటాయించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీకి యాదవులంతా మద్దతుగా నిలవాలని తెనాలికి చెందిన యాదవ నేతలు కోరారు. పట్టణానికి చెందిన వైద్యులు డాక్టర్ అవినాష్, డాక్టర్ అఖిలేష్ ఇతర యాదవ ప్రముఖులు గురువారం నరసరావుపేటలోని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను కలిశారు. తమ మద్దతు తెలియజేస్తూ అనిల్ గెలుపు కోసం కృషిచేస్తామని హామీనిచ్చారు.. శాలువా, పూలమాలతో సత్కరించి, శ్రీకృష్ణుడి విగ్రహాన్ని జ్ఞాపికగా బహూకరించారు. అనిల్‌ను గెలిపించడం ద్వారా సీఎం వైఎస్ జగన్ పెట్టుకున్న నమ్మకాన్ని, చూపుతున్న అభిమానాన్ని నిలుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాడిబోయిన బుచ్చిరాజు, తాడిబోయిన సాంబశివరావు, తాడిబోయిన నాగేశ్వరరావు, గంపల శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ ఫేక్ కాల్స్

- ప్రభుత్వంపై బురద చల్లుతూ ప్రజలకు ఫోన్లు
- సంక్షేమ పథకాల్లో లోపాలంటూ ఐవీఆర్ఎస్ సంభాషణలు
- భూములు లాగేసుకుంటారని ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం
- బ్లాక్ చేస్తున్న కొద్దీ కొత్త నంబర్లతో ఫోన్లు
- స్పామ్ కాల్స్‌గా పేర్కొంటూ బ్లాక్ చేస్తున్న వినియోగదారులు



టీడీపీ నుంచి వస్తున్న కాల్స్‌ను బ్లాక్ చేస్తున్న వినియోగదారులు

గుంటూరు ఎడ్యుకేషన్: సార్వత్రిక ఎన్నికల వేళ ప్రభుత్వంపై టీడీపీ ఫేక్ కాల్స్ ద్వారా దుష్ప్రచారం సాగిస్తోంది. ప్రభుత్వ పనితీరు బాగోలేదని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే ఓటు వేయాలంటూ ఫోన్ కాల్స్ ద్వారా ఊదరగొడుతోంది. కొత్త నంబరు నుంచి ఫోన్ రావడంతో లిఫ్ట్ చేసిన వినియోగదారుల చెవులు చిల్లులు పెడుతోంది. చంద్రబాబు పరిపాలన అమోఘం అని, రాజధాని నిర్మాణం అవసరమని, ఉపాధి లేదనీ, సంక్షేమం, అభివృద్ధి పేరుతో కల్లబొల్లి మాటలు చెబుతూ పదే, పదే ఫేక్ కాల్స్‌తో ప్రజల సహనాన్ని పరీక్షిస్తోంది. ఎన్నికల్లో మీ ఓటు ఏ పార్టీకి వేస్తారంటూ సర్వే నిర్వహిస్తున్నారు.



సెల్ ఫోన్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని టీడీపీ సాగిస్తున్న ఊకదంపుడు ప్రచారంపై ప్రజలు తమదైన శైలిలో సమాధానమిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాల్లో లోపాలంటూ ఐవీఆర్ఎస్ ద్వారా సంభాషణలు చేయడంతో పాటు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా భూములు లాగేసుకుంటున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ విధంగా ప్రతి వినియోగదారునికి రోజులో ఐదు నుంచి పది కాల్స్ టీడీపీ నుంచే వస్తున్నాయి. టీడీపీ నుంచి వస్తున్న కాల్స్‌ను బ్లాక్ చేస్తూ వాటిని స్పామ్ కాల్స్‌గా మెన్షన్ చేస్తూ వినియోగదారులు తిప్పికొడుతున్నారు. వినియోగదారుడు బ్లాక్ చేసిన నంబర్ నుంచి కొత్త కొత్త నంబర్లతో ఫోన్లు చేస్తుండటంతో ఎసంబంధిత సెల్ ఫోన్ నెట్‌వర్క్ ద్వారా డీఎన్‌డీ ఆప్షన్ ద్వారా ప్రమోషనల్ కాల్స్‌ను పూర్తిగా బ్లాక్ చేసుకుంటున్నారు. ట్రూ కాలర్ వాడుతున్న వారికి టీడీపీ నుంచి కాల్ రావడంతోనే స్పామ్ కాల్‌గా డిస్ప్లే అవుతువడటంతో ఫోన్ లిఫ్ట్ చేయకుండానే బ్లాక్ చేసి, తలనొప్పిని వదిలించుకుంటున్నారు. ఈ విధంగా టీడీపీ నుంచి ప్రతి రోజూ పదుల సంఖ్యలో కొత్త నంబర్లతో ఫేక్ కాల్స్ వెళ్తున్నప్పటికీ ఎన్నికల సంఘం దృష్టి సారించడం లేదు.

బయటికొస్తున్న వసంత నేలమాళిగలు!

- మైలవరం నియోజకవర్గంలో రూ.300 కోట్లకుపైగా డంప్ చేసినట్లు ప్రచారం
- ఇప్పటికే రూ.30లక్షల మద్యం, రూ.కోటి నగదు పట్టివేత
- ఇదంతా ఉమా వర్గీయుల పనేనంటూ ప్రచారం



వసంత అనుచరుల నుంచి పట్టుబడిన మద్యం కేసులు(ఫైల్)

జి.కొండూరు: టీడీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకటకృష్ణప్రసాద్ నేలమాళిగలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి ప్రజాదరణ కోల్పోయిన వసంత, పార్టీ మారి టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు ఓటర్లను ప్రలోభపెట్టడమే లక్ష్యంగా ఆయన చేస్తున్న చర్యలు చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. తన ప్రత్యర్థి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుని రాజకీయంగా ఎదుర్కోలేక తనకున్న ఆర్థిక బలంతో డబ్బు, మద్యాన్ని భారీ స్థాయిలో నియోజకవర్గంలో డంపు చేశారని వచ్చిన ఆరోపణలను నిజం చేశారు. ఇప్పటికే భారీ స్థాయిలో మద్యం, డబ్బు పట్టుబడటంతో పాటు ఇంకా భారీగా డబ్బు నిల్వలు ఉన్నట్లు అధికారులకు సమాచారం అందుతుండటంతో సోదాలు జరుపుతూనే ఉన్నారు. ఇదిలా ఉంటే ఎలాగైనా ఎమ్మెల్యేగా గెలవాలనే వసంత పదవీ కాంక్షకు దేవినేని ఉమా వర్గీయులు చరమగీతం పాడేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది.

రూ.300కోట్లు డంప్!

మైలవరం నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందడమే లక్ష్యంగా రూ.300కోట్లకు పైగా నగదు, భారీగా మద్యం సీసాలను నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో వసంత తన అనుచరుల ఇళ్ల వద్ద డంపు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఓటర్లను ఎలాగైనా ప్రలోభపెట్టడమే లక్ష్యంగా ఈ చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మైలవరం మండల పరిధి అనంతవరం వద్ద వసంత అనుచరుడు చేబ్రోలు రాజుతో పాటు మరో నలుగురు టీడీపీ కార్యకర్తలు మద్యం తరలిస్తూ పట్టుబడగా వీరి నుంచి 400కేస్‌ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వెంటనే బుధవారం గొల్లపూడిలోని ఆలూరి సురేష్ ఇంట్లో ఎన్నికలలో పంపిణీ చేసేందుకు దాచి ఉంచిన రూ.కోటి నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు ఘటనలతో వసంత ప్రలోభాల పర్వం గుట్టు రట్టైంది.



గొల్లపూడిలోని ఆలూరి సురేష్ నివాసం, రూ.కోటి పట్టుబడింది ఇక్కడే

ఉమా వర్గీయుల పనేనంటూ..

వసంత వెంకటకృష్ణప్రసాద్ అనుచరుల వద్ద మద్యం, నగదు పోలీసులకు పట్టుబడిన ఘటనల వెనక దేవినేని ఉమా వర్గీయులు ఉన్నట్లు చర్చ జరుగుతోంది. దేవినేని ఉమామహేశ్వరరావుకి సీటు దక్కకపోవడం వల్లే తన అనుచరుల చేత పోలీసులకు లీకులు ఇప్పించి నగదు, మద్యాన్ని పట్టిస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా చర్చ సాగుతోంది. వసంత వెంకటకృష్ణప్రసాద్ రాజకీయంగా మైలవరం నియోజకవర్గంలో పాతుకుపోతే దేవినేని ఉమామహేశ్వరరావు రాజకీయ భవిష్యత్తుకు ఎండ్ కార్డు పడుతుందేమోనని భయంతోనే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని టీడీపీలోనే మరోవర్గం నాయకులు చర్చించుకుంటున్నారు.

ఆసక్తిగా గమనిస్తున్న ప్రజలు

వసంత వెంకటకృష్ణప్రసాద్, దేవినేని ఉమామహేశ్వరరావులు రాజకీయ ఆధిపత్యం కోసం పడుతున్న పాట్లను నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. పదవీకాంక్షతో దశాబ్దాల వైరాన్ని పక్కనబెట్టిన ఒకరితో ఒకరు చేతులు కలపడం, ఆ వెంటనే ఉమా వర్గీయులపై వసంత తన ఉద్యోగులతో నిఘా పెట్టడం, ఆ వెంటనే వసంత డంప్ చేసిన నగదు, మద్యం పట్టుబడటం వంటి ఘటనలతో నియోజకవర్గ ప్రజలకు ఒక క్రైమ్ థ్రిల్లర్ మూవీని చూసినట్లు ఉంది. నియోజకవర్గ టీడీపీలో జరుగుతున్న రోజుకో వింత పరిణామం చూసిన ప్రజలు, వసంత తన ఓటమిని ముందే గ్రహించి పరువు నిలబెట్టుకునేందుకు ప్రలోభాలకు తెరలేపారని చర్చించుకుంటున్నారు. ఇదంతా ఇలా ఉంటే వసంత, ఉమా చేష్టలు పార్టీ అస్తిత్వానికే ప్రమాదంగా మారాయంటూ టీడీపీ సీనియర్లు తలలు పట్టుకుంటున్నారు. దశాబ్దాల రాజకీయ చరిత్ర ఉన్న పార్టీలో ఇటువంటి పరిణామాల వల్ల పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యమే.. మహా భాగ్యం

- పేద ప్రజలకు బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ బియ్యం
- ఇంటి వద్దకే రేషన్ సరఫరాతో సమయం ఆదా
- పౌర సరఫరా శాఖలో ప్రభుత్వం వినూత్న మార్పులు
- హర్షం వ్యక్తం చేస్తున్న కార్డుదారులు

రాజు తన రాజ్యం విస్తరించుకోవాలని.. తన పరివారాన్ని పెంచుకోవాలని, తన కీర్తి కిరీటాలు ఎల్లలు దాటాలని ఆకాంక్షిస్తాడు. అదే నాయకుడైతే.. ఇంకా చెప్పాలంటే ప్రజల మెచ్చిన పాలకుడైతే ముందుగా తన ప్రజలు సంతోషంగా.. ఆరోగ్యంగా జీవించాలని భావిస్తాడు. ఆ దిశగా కృషి చేస్తాడు. ఈ కోవలోకి వస్తారు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. పేదవాళ్లే కదా.. ఏం తింటే ఏముందిలే అనుకోలేదు. మధ్య తరగతి, పేదవారు తినే రేషన్ బియ్యం ఉపయోగంగా, ఆరోగ్యకరంగా ఉండాలని భావించారు. అంతేకాదు సరుకులు అందజేసే పౌర సరఫరాల శాఖలో సమూల మార్పులు తీసుకొచ్చారు. సార్టెక్స్, ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ సదుపాయాన్ని కల్పించారు. సిబ్బంది ప్రజలతో ఎంతో మర్యాదగా మెలిగే విధంగా మార్పులు చేశారు.

గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లాలో మొత్తం 5.99 లక్షల రేషన్ కార్డులున్నాయి. గతంలో వీరందరికీ 972 రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరుకులు అందజేసేవారు. 2019 తర్వాత ఈ శాఖలో సమూల మార్పులు చేశారు సీఎం వైఎస్ జగన్. 353 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని 2021 ఫిబ్రవరి నుంచి ప్రారంభించారు. అత్యంత నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని పంపిణీ ప్రారంభించారు. అనంతరం గతేడాది జూన్‌లో అత్యంత బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ ప్రారంభించారు. ఈ బియ్యంలో ఎన్నో పోషక విలువలున్నాయి. వీటితో బహుళ ప్రయోజనాలు కూడా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రతి నెలా సరుకుల పంపిణీలో భాగంగా జిల్లా ఉన్నతాధికారులతోపాటు అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ప్రజల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు.



ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దనే రేషన్ తీసుకుంటున్న స్థానికులు

ఫోర్టిఫైడ్ బియ్యంతో ఉపయోగాలు



ఈ బియ్యంతో పాటు 1:100 నిష్పత్తిలో బియ్యంలా ఉండే తెల్లని (ఎఫ్ ఆర్‌కే) గింజలను కలుపుతారు. దీంతో అవి ఫోర్టిఫైడ్ బియ్యంలా మారతాయి. ఈ బియ్యం సాధారణ బియ్యంలానే కనిపిస్తాయి. దీన్లో ఐరన్, ఫోలిక్ యాసిడ్, బీ12 ఉంటాయి. ఈ రైస్‌తో వండిన అన్నం తింటే రక్త హీనతను, సూక్ష్మ పోషక లోపాలను అరికట్టవచ్చు. ఇవి అన్నంలానే కాకుండా పిండి వంటలు, టిఫిన్స్‌లోనూ వాడుకోవచ్చు.

చాలా మార్పు వచ్చింది



గతేడాది నుంచి మేము ఫోర్టిఫైడ్ బియ్యాన్ని క్రమం తప్పకుండా వాడుతున్నాం. రుచిలో మార్పు ఉంది. ముఖ్యంగా పిల్లలకు మంచిదని చెబుతున్నారు. మా పిల్లలకు కూడా వాడుతున్నాం. దీనిలో ఏదో ప్రత్యేకత ఉంది. గతంతో పోల్చుకుంటే బాగా మార్పు వచ్చింది.

– ఎస్. కనకదుర్గ, గుంటూరు

సమయం ఆదా



గతంలో రేషన్ కోసం బారులు తీరేవారం. రేషన్ దుకాణం కూడా వారికిష్టం వచ్చే సమయంలోనే తెరిచేవారు. ఇప్పుడు వ్యాన్స్‌లో వచ్చి మా ఇంటి వద్దనే రేషన్ అందజేస్తున్నారు. వ్యాన్ సిబ్బంది కూడా ఎంతో మర్యాదగా మాట్లాడుతున్నారు. ఈ విధానం చాలా బాగుంది.

– బి.రమాదేవి, గుంటూరు.

హలో..1950.!



సత్తెనపల్లి: ఎన్నికలకు సంబంధించి ఏ అంశం మీదైనా.. సందేహాలు నివృత్తి చేసుకోవడానికి, ఫిర్యాదులు చేయడానికి జిల్లా కలెక్టరేట్‌లో అందుబాటులో ఉన్న ఉచిత సహాయ వాణి (టోల్ ఫ్రీ) నంబరు 1950. ఎన్నికల సంఘం 1950 జనవరి 25న స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థగా ఏర్పాటైంది. ఇది ఎన్నికలకు సంబంధించినంత వరకు స్వతంత్రంగానే నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రతిసారి సాధారణ ఎన్నికల సమయంలో దేశవ్యాప్తంగా 50 లక్షల మంది ఉద్యోగుల సేవలను వినియోగించుకుంటుంది. దేశంలో మొదటిసారి సాధారణ ఎన్నికలను హిమాచల్ ప్రదేశ్‌లోని 'చిని' లో నిర్వహించారు. ఆ సమయంలో ఎన్నికల సంఘం పుట్టిన సంవత్సరం 1950 నంబరును ఆ సంస్థ ఉచిత సహాయ, ఫిర్యాదుల కోసం కేటాయించడం గమనార్హం. ఈ సహాయ కేంద్రం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:30గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

ఫిర్యాదులు చేయవచ్చు..

ఎన్నికల సమయంలో అధికారులు, ఉద్యోగులు నిబంధనలు పాటించుకున్నా.. అధికారులు ఎవరైనా రాజకీయ పార్టీలతో అంటకాగినా.. వారు చేసే విందు, వినోదాల్లో పాల్గొన్నా ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదులు చేయొచ్చు. కొంత మంది అధికారులు దూర ప్రాంతాల నుంచి ఎన్నికల విధులకు వస్తుంటారు. పార్టీల నాయకులు వారికి వసతి, భోజనం ఏర్పాట్లు చేస్తుంటారు. అటువంటి వారిపైన ఫిర్యాదు చెయొచ్చు.

పశ్చిమలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం

నెహ్రూనగర్ : గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం ఖాయమని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పశ్చిమలో మంత్రి విడదల రజిని గెలుపు కోసం ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి అందజేస్తున్న సంక్షేమ పథకాలే ఆయన్ను తిరిగి ముఖ్యమంత్రిని చేస్తాయన్నారు. పశ్చిమలో విడదల రజిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చెప్పుల శ్రీను, చంద్రశేఖర్, మరుబోయిన శివ, కోటేశ్వరరావు, శ్రీను, కోటి పాల్గొన్నారు.



కరపత్రం అందజేస్తున్న నారాయణ ముదిరాజ్

సాక్షి గుంటూరు

శుక్రవారం । 10, మే । 2024




బండ్లమ్మ సేవలో మనో కుటుంబం

పిట్టలవానిపాలెం: చందోలులోని బండ్లమ్మ వారిని గురువారం సినీ గాయకుడు మనో కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శ్యామలా దండకాన్ని ఆలపించారు.



పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం

నెహ్రూనగర్: మంగళగిరి ఆర్‌ఓ, జేసీ జి.రాజకుమారి, గుంటూరు పశ్చిమ ఆర్‌ఓ కె.రాజ్యలక్ష్మి గురువారం ప్రభుత్వ మహిళా కాలేజీలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌ఓ ఆస్పత్రుల తనిఖీ



గుంటూరు మెడికల్: ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. బుధవారం, గుంటూరు నగరంపాలెంలోని నందన హాస్పిటల్, రైలుపేటలోని వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ చినకోండ్రుపాడులోని కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పటల్, పొన్నూరులోని డి.వి.సి.హాస్పిటల్, వి-కార్డియాక్ సెంటర్‌లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో స్కానింగ్ సెంటర్లు, ఫైర్ ఎక్విప్‌మెంట్, బయో మెడికల్ డిస్పోజల్‌ను పరిశీలించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు నిబంధనలు అమలు చేయాలన్నారు. డెమో జయప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జీవన్ బాబు పాల్గొన్నారు.

15న భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 15న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దర్యాప్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. ro.guntur@epfindia. gov. in తోపాటు వాట్సాప్ నంబరు 9494657469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863-2344106, 2232921లలో సంప్రదించాలని పేర్కొన్నారు. అదేవిధంగా వెబ్ ఎక్స్ ఐడీ 2644 170 9396, పాస్‌కోడ్ epfo@1234 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. పీఎఫ్ పెన్షన్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు



మంగళగిరి: నగర పరిధిలోని కాజ టోల్‌గేట్ వద్ద గురువారం విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. అనంతరం ట్రైనీ ఐపీఎస్ అధికారులకు ఎన్నికలలో అనుసరించాల్సిన విధి విధానాలను వివరించి పలు సూచనలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సి బందోబస్తు ప్రక్రియ, చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల నిబంధలను వివరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, అక్రమ మద్యం, నగదు రవాణా అరికట్టడం, పోలింగ్ స్టేషన్ల వద్ద నిర్వహించాల్సిన భద్రతను క్షుణ్ణంగా వివరించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి మనోజ్‌కుమార్ హెగ్డే, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు 1,379 మంది విద్యార్థులు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలో విద్యాహక్కుచట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి మొదటి విడతలో 1,379 మంది విద్యార్థులు ఎంపికైనట్లు డీఈఓ పి.శైలజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకున్న 2,223 మంది బాలల్లో వీరిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సంబంధిత విద్యార్థులను ఈనెల 10న ఆయా పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. సంబంధిత విద్యార్థులను ఎట్టిపరిస్థితుల్లో పాఠశాలల్లో చేర్చుకోవాలని యాజమాన్యాలను ఆదేశించారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలతో విధిగా ఒక రిజిస్టరు నిర్వహించాలని సూచించారు.

అందుబాటులో ఉంటా..

అభివృద్ధి చేసి చూపిస్తా

తాను పక్కా లోకల్ అని.. తనకు జిల్లా వాసులతో సత్సంబంధాలు ఉన్నాయని.. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని సమస్యలు.. వాటికి పరిష్కార మార్గాలు తనకు స్పష్టంగా తెలుసని.. కార్మిక పక్షపాతిగా, కార్మికులు, రైతుల కోసం ఎన్నో పోరాటాలు చేశానని.. చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన క్రమంలో వ్యాపార వర్గాలకు అండగా నిలిచానని.. పొన్నూరులో 20 ఏళ్లలో జరగని అభివృద్ధి ఈ ఐదేళ్లలో చేశానని.. ఆ అనుభవంతో గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతానని.. వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య తెలిపారు. గురువారం ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో మాట్లాడారు. – పట్నంబజారు



వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య

సాక్షి ఇంటర్వ్యూ

- నేను పక్కా లోకల్
- గత 30 ఏళ్లుగా జిల్లా ప్రజలతో సత్సంబంధాలు
- పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలు .. వాటి పరిష్కారాలు స్పష్టంగా తెలుసు
- స్థానికుడిగా పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తా
- పొన్నూరు నియోజకవర్గంలో గత 20 ఏళ్లలో లేని అభివృద్ధి ఐదేళ్లలో చేసి చూపా
- గుంటూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పూర్తిస్థాయిలో దృష్టి
- అన్ని నియోజకవర్గాల్లో పరిశ్రమల స్థాపనకు కృషి చేసి.. ఉపాధి కల్పిస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య

పేదల కష్టాలు తెలుసు..

గత 30 సంవత్సరాలుగా గుంటూరు ప్రజలతో మమేకమై ముందుకు సాగుతున్నాను. మిర్చి అసోసియేషన్ అధ్యక్షుడిగా 20 ఏళ్లపాటు పనిచేసిన నాకు కార్మికుల కష్టాలు, పేద ప్రజల జీవితాలు, అట్టడుగు వర్గాల పరిస్థితులు సుస్పష్టంగా తెలుసు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై క్షుణ్ణంగా అవగాహన ఉంది.

వ్యాపార వర్గాలకు అండగా ఉంటా..

చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన క్రమంలో వ్యాపార వర్గాలకు చేయూతనందించాను. ఎంపీగా నన్ను గెలిపిస్తే వ్యాపారవర్గాలకు పూర్తిస్థాయిలో అండగా ఉంటాను. రైతులు, మిర్చి వ్యాపారులు, ఇతర కూలీలు, కార్మికులకు అన్ని విధాలుగా అండగా నిలబడతా. 2003, 2006లలో స్పైసెస్ బోర్డు సభ్యుడిగా పనిచేసిన నేను దిగుమతి మిర్చి క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ఏర్పాటుకు పాటుపడ్డా. 1994 నుంచి ఇప్పటివరకు అనేకమంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను అందజేస్తూ సాయం అందిస్తున్నాను.

పొన్నూరును అభివృద్ధి చేశా.. జిల్లాను చేసి చూపిస్తా..

2019లో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన క్రమంలో విజయం సాధించాను. పొన్నూరులో 20 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలోనే చేసి చూపించా. రూ. 1600 కోట్లు సంక్షేమం, రూ.300 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. రోడ్డు వైడెనింగ్, మద్రాస్ కాలువపై బ్రిడ్జి, ఆర్టీసీ డిపో అభివృద్ధి, నిడుబ్రోలు పార్కు అభివృద్ధి, బస్సు షెల్టర్లు, తాగునీటి వ్యవస్థను సరిచేయడం, రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టి ప్రజలకు ఎంతో మేలు చేశాను.

పార్లమెంట్ సభ్యుడిగా గెలిపిస్తే..

- గుంటూరు నగరంలో ప్రధానంగా ఉన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తా. శంకర్‌విలాస్ ఓవర్‌బ్రిడ్జి పునఃనిర్మాణం, నందివెలుగు ఓవర్‌బ్రిడ్జి పూర్తి చేయడం, శ్యామలానగర్, ఇన్నర్‌రింగ్‌రోడ్డు, సంజీవయ్య నగర్‌లలో బ్రిడ్జిల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాను.
- డెల్టా ప్రాంతం తెనాలి, పొన్నూరు, మంగళగిరి ప్రాంతాల్లో వ్యవసాయ భూముల్లో డ్రెయిన్లు ఏర్పాటు చేసి రైతులకు మేలు చేసే విధంగా కృషి చేస్తాను. ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనకు కృషి చేసి ఉపాధి పెంచేందుకు కృషి చేస్తాను. పేద వర్గాలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తాను. దీంతోపాటుగా నియోజకవర్గాల్లో ప్రతి సమస్య పరిష్కారానికి నావంతు కృషి చేస్తాను.
- గత పది సంవత్సరాల్లో ఎంపీగా పనిచేసిన టీడీపీకి చెందిన గల్లా జయదేవ్ ప్రజలకు కనబడిన పాపాన పోలేదు. అభివృద్ధి పూర్తి స్థాయిలో కుంటుపడింది. ఎంపీ నిధులు ఒక్కరూపాయి కూడా తీసుకొచ్చిన పరిస్థితి లేదు. పరిశ్రమలు తెచ్చి ఉపాధి కల్పిస్తానని చెప్పి పలాయనం చిత్తగించాడు.
- పెమ్మసాని చంద్రశేఖర్‌కు కూడా స్థానిక అంశాలపై ఏమాత్రం అవగాహన లేకపోగా, డబ్బు ఉందనే అహంకారంతో వ్యవహరిస్తున్నాడు. కనీసం ప్రజా సేవ ఏమాత్రం చేయని పెమ్మసాని తానేదో డబ్బు ఉన్న వ్యక్తినని డాబు కొట్టడం విడ్డూరంగా ఉంది. ట్రాఫిక్ సమస్యతోపాటు, బ్రహ్మానందరెడ్డి స్టేడియం అభివృద్ధి, వాకింగ్ ట్రాక్‌ను మరింత మెరుగు పరిచే దిశగా ముందుకు సాగుతాను.

నేడు మంగళగిరికి సీఎం వైఎస్ జగన్

- పాత బస్టాండ్ సెంటర్‌లో భారీ బహిరంగ సభ
- నిడమర్రు రైల్వేగేటు వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు
- సభ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్యల పిలుపు



హెలిప్యాడ్ స్థలంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మంగళగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మంగళగిరిలో జరగనున్న భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. పాతబస్టాండ్ సెంటర్‌లో నిర్వహించనున్న బహిరంగసభలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యలు గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు పాతబస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ ప్రారంభమవుతుందని తెలిపారు.

హెలిప్యాడ్ స్థల పరిశీలన..

సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో నిడమర్రు రైల్వేగేటు పాత డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన స్థలంలో హెలిప్యాడ్‌ను ఉన్నతాధికారులు పరిశీలించారు. అధికారులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించి పలు సూచనలు చేశారు.

ప్రచార పర్వం



భవిష్యత్తుపై భీమా పత్రం: వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి, మంత్రి విడదల రజిని, ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే మద్దాళి గిరితో కలిసి కృష్ణనగర్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓ వృద్ధురాలికి పథకాలు వివరించి, కరపత్రాలు అందజేశారు. - పట్నంబజారు



తాతా పింఛన్ ఇంటికే వస్తుందిలే..: గుంటూరు తూర్పు నియోజకవర్గం రామిరెడ్డితోట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి నూరి ఫాతిమా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమం కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. - పట్నంబజారు



దండెత్తిన అభిమానం: వైఎస్సార్ సీపీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య నగర పరిధిలోని యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. లావణ్యకు హారతులు, పూలమాలలతో స్థానికులు ఘనస్వాగతం పలికారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని ఆమె పేర్కొన్నారు. - మంగళగిరి

గుంటూరు.. సూపర్

ఐదేళ్లలో మారిన నగర రూపురేఖలు

- యూజీడీ పేరిట నగరమంతా తవ్వి వదిలేసిన గత టీడీపీ ప్రభుత్వం
- గుంటల రోడ్ల నుంచి సుందర నగరంగా మార్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పథంలోకి...
- రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు
- గుంటూరు నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయస్థాయి అవార్డులు
- సుందరీకరణపై దృష్టి
- చెంతకే ఆధునిక వైద్యం



నగర ప్రజల ఆహ్లాద కేంద్రం : రూ.4.5 కోట్లతో పునరుద్ధరించిన గుంటూరు గాంధీ పార్కు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగర రూపురేఖలు మారాయి. ఒకప్పుడు గతుకుల రోడ్లు, పూడుకుపోయిన డ్రైన్లు, మూతపడిన పార్కులతో ఉండే గుంటూరు నగరం నేడు సుందరనగరంగా రూపుదిద్దుకుంది. అభివృద్ధి బాటలో పయనిస్తూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధిస్తూ ముందుకు పోతోంది. నగరంలోని కీలకమైన రోడ్ల విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పార్కులు అభివృద్ధి చెందాయి. సెంట్రల్ లైటింగ్‌తో పాటు సెంట్రల్ డివైడర్లు పచ్చదనం సంతరించుకున్నాయి. దీనంతటికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చిత్తశుద్ధే కారణం.

గుంతలూరుగా మార్చిన గత టీడీపీ ప్రభుత్వం

గత ప్రభుత్వం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ(యుజీడీ) పేరుతో నగరమంతా రోడ్లు తవ్వి వదిలేసింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో నగరాన్ని గుంతలూరుగా మార్చి రూ.కోట్లు టీడీపీ నాయకులు తమ జేబుల్లో నింపుకొన్నారు. వైఎస్సార్ సీపీ పాలకవర్గం అధికారంలోకి వచ్చిన వెంటనే ముందు నగరంలో యూజీడీ వలన దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేపట్టి నగర ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కల్పించింది. కేవలం యూజీడీ వలన నాశనమైన రోడ్ల మరమ్మతులకే సుమారు రూ.50 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది.

విస్తరణ దిశగా కీలక రోడ్లు

రోడ్ల విస్తరణపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. తొలివిడతగా నందివెలుగు రోడ్, కుష్టర్ హాస్పిటల్ రోడ్, పెద్ద పలకలూరు రోడ్, ఏటీ అగ్రహారం, డొంక రోడ్లను విస్తరించారు. ఫలితంగా ఏళ్ల తరబడి రోడ్లు, కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఊరట వచ్చింది.

ఇదిగో.. మార్పు

29 వేల మందికి ఇళ్లస్థలాలు

గుంటూరు అర్బన్ పరిధిలోని పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలకు సంబంధించి దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న పేదలకు జగనన్న కాలనీలకు సంబంధించి 7 ప్రాంతాల్లో ఏటుకూరు, కొర్నెపాడు, పేరేచర్ల, పొత్తూరు, బుడంపాడు, దామరపల్లి, లాం లే అవుట్స్‌ని సుమారు 1277 ఎకరాల్లో 60 వేల ప్లాట్స్ వేయడం జరిగింది. తొలి విడతగా 28 వేల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు కాగా, ఇప్పటికే 7 వేలు ఇళ్లు పూర్తి అయ్యాయి, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. గుంటూరు నగరంలోనే 29,887 మందికి జగనన్న కాలనీల్లో పేదలందరికీ ఇళ్లు మంజూరు అయ్యాయి. పేరేచర్ల, ఏటుకూరు వద్ద భారీ లేఅవుట్లు వేశారు.



అడవితక్కెళ్లపాడులోని పట్టణ ఆరోగ్యకేంద్రం

నీటి ఎద్దడికి చెక్

నగరంలో వేసవిలో ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా సమగ్రంగా తాగునీరు అందించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. గతంలో పైప్‌లైన్లు వేసినప్పటికీ ఇంటర్ కనెక్షన్, సంజీవయ్యనగర్ రైల్వే ట్రాక్ క్రాసింగ్ చేయకపోవడం వలన తాగునీటి ఎద్దడి ఏర్పడేది. సమస్య శాశ్వత పరిష్కార దిశగా వైఎస్సార్ సీపీ పాలకవర్గం అడుగులు వేసింది. తొలుత రైల్వే అధికారులతో మాట్లాడి సంజీవయ్యనగర్ వద్ద ట్రాక్ క్రాసింగ్ చేయడం, ఇంటర్ కనెక్షన్ ఏర్పాటు చేయించడం జరిగింది. దీని ఫలితంగా నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి పశ్చిమ నియోజకవర్గానికి 800 డయా పైప్‌లైన్ అందుబాటులోకి వచ్చింది. విలీన గ్రామాలకు సమగ్ర తాగునీటిని అందించే గోరంట్ల కొండ మీద రెండు వాటర్ ట్యాంకులను రూ.33 కోట్లతో నిర్మిస్తున్నారు.

అభివృద్ధి పనులు	వెచ్చించిన నగదు
నూతన రోడ్లు, డ్రైన్లు	రూ.491 కోట్లు
పార్కులు	రూ.11.5 కోట్లు
సెంట్రల్ డివైడర్లు	రూ.7.64 కోట్లు
ఐలాండ్స్ అభివృద్ధి	రూ.3.75 కోట్లు
పీవీకే నాయుడు మార్కెట్	రూ.163 కోట్లు
అర్బన్ హెల్త్ సెంటర్లు	రూ.19.71 కోట్లు

ఐకానిక్ భవనంగా పీవీకే నాయుడు మార్కెట్

గుంటూరు నగర ప్రజల చిరకాల వాంఛగా ఉన్న పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది. నగరం నడిబొడ్డున 1.92 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన మార్కెట్ స్థానంలో ఐకానిక్ బిల్డింగ్‌గా గ్రౌండ్, 8 అంతస్తుల మార్కెట్ నిర్మాణం చేపట్టనున్నారు. దీని కోసం రూ. 163 కోట్లు ఖర్చు చేయనున్నారు.


చెంతకే ఆధునిక వైద్యసేవలు

నగరంలో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు రూ.19.70 కోట్లతో నగరంలో 16 వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం జరిగింది

ఉద్యాన నగరంగా..


టీడీపీ హయాంలో నగరంలోని గాంధీపార్క్‌తో పాటుగా ఆయా కాలనీల్లో స్థానికంగా పలు పార్క్‌లను మూలనపడేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో సుమారు రూ.4.5 కోట్లతో గాంధీపార్కును పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. నగరంలో 22 పార్క్‌లను సుమారు రూ.9 కోట్లతో అభివృద్ధి చేయడంతో నూతన శోభను సంతరించుకున్నాయి. 42 కిలోమీటర్ల మేర ఉన్న సెంట్రల్ డివైడర్లను జగనన్న హరిత వనాలలో భాగంగా రూ.6.24 కోట్ల అంచనాలతో అందమైన మొక్కలు ఏర్పాటు చేసి, నిర్వహణ చేస్తున్నారు.

రోడ్ల మరమ్మతులు, నూతన రోడ్ల నిర్మాణంపై దృష్టి..



యూజీడీ వలన దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, నూతన సీసీ రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో రూ.531 కోట్లతో తూర్పులో 792, పశ్చిమలో 918, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 150 వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది.

నగరం.. ఆహ్లాదకరం



నగరాన్ని సుందరీకరించడానికి, చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. నగరంలోని డివైడర్లు, కార్పొరేషన్ గోడలపై రకరకాల పెయింటింగ్ వేసి ఆహ్లాదకరంగా మార్చారు. దీనికోసం సుమారు రూ. 48 లక్షలు ఖర్చు చేశారు. దీంతో గుంటూరు నగరం జాతీయ స్థాయిలో పలు అవార్డులు, ర్యాంకులు సాధించింది.

ఉల్లంఘన పరిస్థితులను గుర్తించండి

పరిశీలకులు పరిమళసింగ్ సూచన



బాపట్ల: పోలింగ్ సమయంలో కోడ్ ఉల్లంఘన పరిస్థితులు ముందుగా గుర్తించి సమాచారం ఇవ్వాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్ తెలిపారు. సూక్ష్మ పరిశీలకుల రెండవ దశ శిక్షణ కార్యక్రమం గురువారం స్థానిక వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు అధిక సంఖ్యలో ఉంటే తక్షణమే ఆర్వోలకు సాధారణ పరిశీలకులకు సమాచారం ఇవ్వాలని పరిమళ సింగ్ అన్నారు. పోలింగ్ కేంద్రాలలో గుర్తించిన అంశాలను ఎప్పటికప్పుడు సంబంధిత దస్త్రాలలో నమోదు చేయాలని సూచించారు. పోలింగ్ సమయంలో సూక్ష్మ పరిశీలకులు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా చెప్పారు. 12వ తేదీన ఉదయం 9 గంటలకు మీకు కేటాయించిన నియోజకవర్గంలోని రిసెప్షన్ సెంటర్ కు చేరుకోవాలన్నారు. తదుపరి పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలన్నారు. ఈ నెల 13వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అదేరోజున ఉదయం 5:30 గంటలకు మాక్ పోలింగ్ చేసే ప్రక్రియను గమనించాలన్నారు. పి ఓ లు, పోలింగ్ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నారా లేదా గుర్తించి మీ దస్త్రాలలో నమోదు చేయాలన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకుల ఆధ్వర్యంలో విధులు నిర్వహించాలన్నారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

- పెమ్మసాని డబ్బులకు రీచ్.. పబ్లిక్‌కు రీచ్ కాదు
- విడతల వారీగా వచ్చిన కరోనా వేళల్లో కనిపించని టీడీపీ
- న్యాయవాదుల న్యాయమైన కోర్కెలను తీర్చిన సీఎం వైఎస్‌జగన్
- న్యాయవాదుల ఆత్మీయ సమావేశం ఎంపీ అభ్యర్థి కిలారి, మంత్రి విడదల రజిని



న్యాయవాదుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని, వేదికపై గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, తూర్పు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా

నగరంపాలెం: గుంటూరు పార్లమెంట్ పరిధిలో టీడీపీ ఎంపీ చేసిన అభివృద్ధి శూన్యమని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. జిల్లా కోర్టులోని గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. రోశయ్య మాట్లాడుతూ కేంద్ర నుంచి నిధులు తీసుకురావడం విఫలమయ్యారని ఆరోపించారు. పార్లమెంట్ ప్రజలకు పరిచయం లేని వ్యక్తి పెమ్మసాని చంద్రశేఖర్‌ను టీడీపీ తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు. ఆయన సమాజాభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ధ్వజమెత్తారు. పెమ్మసాని డబ్బులకు రిచ్ అని, పబ్లిక్‌కు రిచ్‌కాదని విమర్శించారు. ప్రజలతో సంబధాలు లేని వ్యక్తులను ఎన్నికల బరిలోకి దించడం టీడీపీకి ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఇటువంటి మోసగారి వ్యక్తులు ప్రజలను మోసగించేందుకు మరోసారి ఎన్నికల బరిలో దిగారని, అటువంటి వారికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. న్యాయవాదుల కోర్కెలను వెంటనే తీర్చుతామని హామీఇచ్చారు. సోమవారం జరగనున్న ఓటింగ్ ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్-1పై, బ్యాలెట్-2, బ్యాలెట్-3లపై ఉన్న ఫ్యాన్ గుర్తులకే ఓట్లేసి గెలిపించాలని న్యాయవాదులను కోరారు.

న్యాయవాదుల కోర్కెలనుసీఎం దృష్టికి తీసుకెళ్తాం..

న్యాయవాదుల న్యాయమైన కోర్కెలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని అన్నారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడాన్ని ప్రశంసించారు. జూనియర్ న్యాయవాదుల సౌకర్యార్థం వైఎస్సార్ లా నేస్తం పథకం అమలు చేశారని అన్నారు. టీడీపీ కూటమిపై ప్రజలకు నమ్మకం లేదని చెప్పారు. ఏపీలో వైద్య రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చామని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ విద్య, వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులను సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చారని గుర్తు చేశారు. బార్ కౌన్సిల్ సభ్యులు వట్టి జోన్నల బ్రహ్మరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ లా నేస్తం అమలుతో న్యాయవాదులకు సీఎం వైఎస్ జగన్ న్యాయం అందించారని అన్నారు. వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రాల్లోనూ లేని ఏపీలోని న్యాయవాదులకు సీఎం వైఎస్ జగన్ న్యాయం చేశారని అన్నారు. సెల్ రాష్ట్ర అధికారి ప్రతినిధి డాక్టర్ సయ్యద్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి అబ్రహంలింకన్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, కార్యవర్గ సభ్యులు అంకమ్మరావు, ఝాన్సీ, ఇస్మాయిల్, మాజీ ప్రభుత్వ న్యాయవాది పోకల వెంకటరెడ్డి, న్యాయవాదులు పచ్చల అనీల్, సోసి, రమణ, పుష్ప, శ్రీనివాస్, బాబూరావు, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, క్రాంతి సుధాకర్‌రెడ్డి, వై.సుబ్బారెడ్డి, జి.రవికుమార్ పాల్గొన్నారు. తొలుత న్యాయవాదులను ఓట్లు అభ్యర్థించారు.

గుంటూరును తీర్చిదిద్దుకుందాం

- టీడీపీ హయాంలో రోడ్లన్నీ ధ్వంసం
- వైఎస్సార్ సీపీ హయాంలో రోడ్లన్నింటికీ మరమ్మతులు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో టీడీపీ, జనసేనల నుంచి చేరికల వెల్లువ



పార్టీలో చేరిన వారితో మంత్రి రజిని

పట్నంబజారు: గుంటూరు నగరాన్ని పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుకుందామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. స్థానిక శ్యామలానగర్ రెండో లైనులోని మంత్రి నివాసానికి గురువారం నగరంలోని పలు ప్రాంతాల నుంచి టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు చేరుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ గుంటూరు నగర అభివృద్ధి విషయంలో టీడీపీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అన్ని రోడ్లు తీర్చిదిద్దామన్నారు. కొత్తగా ఎన్నో రహదారుల నిర్మాణం జరిగిందని వెల్లడించారు. దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని రహదారులకు కూడా మోక్షం కల్పించామని చెప్పారు. గాంధీపార్కు, శిల్పారామం.. ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తనను గెలిపిస్తే గుంటూరు నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే గొప్ప నియోజకవర్గంగా మార్చడమే తన లక్ష్యమని వెల్లడించారు.

39వ డివిజన్ నుంచి..

నగరంలోని 39వ డివిజన్ నుంచి 23 మంది జనసేన, టీడీపీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ నాయకులు కుమార్, ప్రభు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. లాజర్ బాబు, జి.ప్రభు, మాసిపోగు అనూష, ఎం.రాణి, గోన అశోక్, ఎన్నుబర్ల బాబు తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు ముద్దాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 30 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ముద్దాడ కృష్ణ, ముద్దాడ శివ, విజయలక్ష్మి, కుమారి, శారదా, విజయకుమారి, లక్ష్మీశివకుమారి, జయశ్రీ, విజయలక్ష్మీ రెడ్డి ఉన్నారు. 39వ డివిజన్, గుజ్జనగుండ్ల ప్రాంతం నుంచి 10 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఎస్‌కే అకీబ్‌జావెద్, ఎస్‌కే మున్నా, పఠాన్ సాధిక్ ఖాన్, షేక్ అహ్మద్ అలీ, షేక్ ఇనాం అలీ, షేక్ రబ్బాని, షేక్ నాగూర్ తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

- వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి లావణ్య
- యర్రబాలెంలో ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, గంజి చిరంజీవి

మంగళగిరి: జగనన్నతోనే రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మురుగుడు లావణ్య పేర్కొన్నారు. నగర పరిధిలోని యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం గురువారం నిర్వహించారు. లావణ్యకు హారతులు, పూలమాలలతో స్థానికులు ఘనస్వాగతం పలికారు. లావణ్య మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని చెప్పారు. సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే రావాలంటే మళ్లీ జగనన్నను సీఎంని చేసుకోవాలన్నారు. పెత్తందారులకు, పేదలకు జరుగుతున్న యుద్ధంతో పెత్తందార్లంతా ఏకమై డబ్బుతో ఓటర్లను కొని గెలవాలనుకొంటున్నారని, పేదలంతా ఏకమై పెత్తందార్లును ఓడించి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు వర్గాలకు రాజ్యాధికారం దక్కాలనే లక్ష్యంతో తనకు మంగళగిరి సీటు కేటాయించారని, ప్రజలంతా అండగా నిలిచి తనను, ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్యలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ మహిళకు సీటు కేటాయించడం అభినందనీయమన్నారు. విద్యావంతురాలు అయిన బీసీ మహిళను చట్టసభలకు పంపడం వలన బడుగు వర్గాల సమస్యలపై గొంతెత్తి పరిష్కరించే అవకాశముందన్నారు. పెత్తందారులపై పేదలు విజయం సాధించేలా ఈ నెల 13వ తేదీ ఎన్నికలలో తమ ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. కిలారు రోశయ్య కుమార్తె సాయిదివ్య మాట్లాడుతూ ఐదేళ్లలో పేదలకు ఇంటి వద్దనే సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మహిళా నాయకులు సంకె సునీత, గుండాల శ్రీనివాసరావు, పలగాని కోటేశ్వరరావు, చావలి మురళీకృష్ణ, షఫి, బడే మియా, దానబోయిన నాగయ్య, నృసిముల్లా పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి సుచరిత
- తుళ్లూరు, మందడం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



మందడంలో ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

మందడం(తాడికొండ): తుళ్లూరు మండలంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. గురువారం తుళ్లూరు మండలం మందడం, రాయపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత, కుమార్తె రిషికా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మందడం గ్రామంలో బ్రహ్మరథం పట్టగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి సుచరిత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు ప్రతి పేద వాడికి సక్రమంగా అందాలంటే మళ్లీ జగనన్నను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐదు సంవత్సరాల పాలనలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏపీలో దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందించి నెంబర్‌వన్‌గా నిలిస్తే 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రజలకు అవసరమైన ఒక్క సంక్షేమ పథకమైనా అందించారా అని ప్రశ్నించారు. రాష్ట్ర భవిష్యత్‌కు బంగారు బాటలు వేసి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేసిన జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, కిలారి వెంకట రోశయ్యను ఎంపీగా ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, సొసైటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, గ్రామపార్టీ నాయకులు ఆలూరి చిన్న శ్రీనివాసరావు, షేక్ జానీ, దానం వినోద్, కోలేటి అనీల్, దానం నాగేశ్వరరావు, సాల్మన్ రాజు, కొమ్మినేని దత్తు, ఐనవోలు సుధీర్, బండి ప్రసాద్, బుర్రా వెంకట శివారెడ్డి, చలివేంద్రం సురేష్, తుమ్మూరు రమణారెడ్డి, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో సర్పంచి మాదాసు రత్నకుమారి, ఎంపీటీసీ బోడపాటి సుశీల పాల్గొని ఇంటింటికీ తిరిగి ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటస్వామి, ధర్మరాజు, యేసురత్నం పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మోదుగులకు మాతృవియోగం



నివాళులర్పిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ ఆళ్ల, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు



ఆదిలక్ష్మి(ఫైల్)

గుంటూరు రూరల్: మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాతృమూర్తి ఆదిలక్ష్మి(85) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆదిలక్ష్మి భర్త పాపిరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త, న్యాయవాది, అధికార భాషా సంఘం మాజీ సభ్యుడిగా సేవలందించారు. సోషలిస్ట్ పార్టీలో పని చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు. కుమారులు ప్రముఖ పారిశ్రామికవేత్త వాసుదేవరెడ్డి, మోదుగుల వేణుగోపాలరెడ్డి కాగా కుమార్తె దాక్షాయణి. అల్లుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడుగా కొనసాగుతున్నారు. ఆదిలక్ష్మి భౌతిక కాయానికి పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి విడదల రజని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యేలు మహమ్మద్‌ముస్తఫా, మద్దాళి గిరిధర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, ప్రత్తిపాడు, అద్దంకి, ఈస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థులు బలసాని కిరణ్‌కుమార్, పానెం చిన హనిమిరెడ్డి, షేక్ నూరి ఫాతిమా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొలకలూరి కోటేశ్వరరావు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయుడు(రాము) నివాళులర్పించారు.

పోలీస్ వాహనానికి తప్పిన ప్రమాదం

- వాహనంలో ఇరుక్కుపోయిన హోంగార్డ్
- 2 గంటల పాటు శ్రమించి బయటకు తీసిన పోలీసులు
- స్వల్ప గాయాలు కావడంతో ఊపిరిపీల్చుకున్న అధికారులు



ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వాహనంలో ఇరుక్కుపోయిన హోంగార్డు శ్యామ్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి- పోలీస్‌స్టేషన్ పరిధిలో సీతానగరం ఎన్టీఆర్ కరకట్టకు మధ్య ఉన్న రైల్వే అండర్ పాస్ వద్ద గురువారం రోడ్డు ప్రమాదంలో పోలీసులకు ముప్పు తప్పింది. బైపాస్ రోడ్ నుంచి ఎన్టీఆర్ కరకట్ట మీదుగా ఉండవల్లి అమరావతి కరకట్ట వైపు వస్తున్న పోలీస్ వాహనాన్ని ఉండవల్లి సెంటర్ నుంచి బైపాస్‌రోడ్ వెళుతున్న విజయవాడ డిపోకు చెందిన అమరావతి బస్సు రైల్వే అండర్‌పాస్ కింద మలుపులో అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పోలీస్ వాహనం ఆర్టీసీ బస్సుకన్నా చిన్నది కావడంతో పోలీస్ వాహనానికి తీవ్రంగా నష్టం వాటిల్లడంతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న కానిస్టేబుళ్లు ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. డ్రైవర్‌గా ఉన్న హోంగార్డ్ శ్యామ్ స్టీరింగ్, సీటుకు మధ్య ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న తాడేపల్లి ట్రాఫిక్ సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐలు నారాయణ, రమేష్ అక్కడకు చేరుకుని ఇరుక్కుపోయిన శ్యామ్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నాలు చేశారు. ఎంత ప్రయత్నించినా డ్రైవర్‌ను బయటకు తీయలేకపోవడంతో రెండు క్రేన్‌లు పిలిపించి, ఒక క్రేన్‌ను బస్సు వెనుక, మరో క్రేన్‌ను బస్సు ముందు ఏర్పాటు చేసి జాగ్రత్తగా బయటకు లాగారు. ఈ ప్రమాదంలో హోంగార్డు శ్యామ్ పొట్ట, కాళ్లకు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే పోలీస్ వాహనంలో గాయపడిన ఇద్దరు కానిస్టేబుళ్లతో పాటు శ్యామ్‌ను ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స నిర్వహించారు. ప్రమాదంపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేల్పూరు పోలింగ్ కేంద్రంలో ఎన్నికల ప్రత్యేకాధికారి



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను పల్నాడు జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకులు, డీఐజీ డాక్టర్ అజిత్ సింగ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నామని చెప్పారు. గొడవలు, అల్లర్లకు తావులేకుండా ఇరు పార్టీల ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్, ఎస్సై చల్లా సురేష్ ఉన్నారు.

ఓటరు కార్డుకు 31 ఏళ్లు



కొరిటపాడు/సత్తెనపల్లి: ఎన్నికల సమయంలోనే కాదు.. ఇతర అత్యవసరాలకు గుర్తింపు కోసం ఉపయోగపడే ఓటర్ కార్డు రూపకర్త ఎవరు..? ఎప్పుడు వచ్చిందో మీకు తెలుసా.? తెలియకపోతే కచ్చితంగా తెలుసుకుందాం రండి.. 1950 జనవరి 25న భారత ఎన్నికల కమిషన్ ఏర్పాటైనప్పటి నుంచి 1993 వరకు ఓటరు గుర్తింపు కార్డులనేవి లేనే లేవు. అయితే దొంగ ఓటర్లను నివారించి, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలనే సదుద్దేశ్యంతో సరిగ్గా 31 ఏళ్ల క్రితం 1993లో అప్పటి కేంద్ర ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ వినూత్న సంస్కరణకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే పుట్టుకు వచ్చిన ఓటరు కార్డ్ ఓ వజ్రాయుధంలా మారింది. తొలి దశలో నలుపు తెలుపు రంగులో ఉన్న ఓటరు కార్డులను కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసింది. ప్రస్తుతం డిజిటల్ రూపంలో ముద్రించిన కార్డులు అందుబాటులోకి వచ్చాయి. నూతన ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు భద్రతా ప్రమాణాలు కలిగి ఉన్నాయి. నకిలీ ఓటర్లు, దొంగ ఓట్లను నివారించేందుకు, ట్యాంపరింగ్ చేసేందుకు వీలులేని విధంగా దీనిపై మన దేశ చిత్ర పటంతో కూడిన హోలోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఈ పీవీసీ కార్డులపై ఓటర్ల ఫొటోలు గతంలో కంటే మరింత స్పష్టంగా కనిపించేలా ముద్రించారు. దీంతోపాటు ఓటరు పూర్తి పేరు, చిరునామా తదితర వివరాలను ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ముద్రించారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘన

బొల్లాపల్లి : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరుకున్నప్పటికీ కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూనే ఉన్నారు. రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొంటూనే ఉన్నారు. మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన గ్రామ నౌకరు బందరపు బాబూరావు టీడీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. ఈ విషయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాయీ బ్రాహ్మణులకి సీఎం జగన్ న్యాయం



నరసరావుపేట: రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణులకు చేసిన మేలు అద్భుతమని ఏపీ నాయీ బ్రాహ్మణ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ఇంటూరి బాజ్జినంద అన్నారు. బుధవారం నాయీ బ్రాహ్మణులకు జరిగిన మేలును తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాన్ని పట్టణంలోని పలు సెలూన్ షాపుల యజమానులకు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరారు. పల్నాడు జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సాయి శివ విశ్వ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోస్టల్ బ్యాలెట్

గుంటూరు వెస్ట్: జిల్లాలోని పార్లమెంట్ ఏడు నియోజకవర్గాలకు సంబంధించి గత నాలుగు రోజుల నుంచి జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ గురువారంతో ప్రశాంతంగా ముగిసింది. తాడికొండలో 148, మంగళగిరిలో 179, పొన్నూరులో 101, తెనాలి 193, ప్రత్తిపాడు 107, గుంటూరు పశ్చిమ 114, గుంటూరు తూర్పు 145 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి.

మోసాలు, అబద్ధాల చంద్రబాబూ...

భూమిని లాగేసుకోవడమంటే ఇదే..

- టీడీపీ హయాంలో అమరావతిలో జరిగిందదే
- పేదల భూముల విస్తీర్ణం తగ్గించి పెద్దలకు కలిపేసి...
- ప్రభుత్వ ఆస్తులూ బాబు సామాజికవర్గీయుల పరం
- తుళ్లూరు మండలం నెక్కల్లుపై ఓ లుక్కేద్దామా...

గద్దలైనా, రాబందులైనా కళేబరాలను పీక్కుతింటాయి. జీవంతో ఉన్నవాటిని తినాలంటే కష్టపడి, వేటాడి చంపిన తరువాతే ఆరగిస్తాయి. కానీ, అమరావతి రాజధాని పేరిట జరిగిన భూ దందాను పరిశీలిస్తే గద్దలు, రాబందులు మేలైనవేమో అనిపిస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు విభిన్న వర్గాలకు చెందిన సన్న, చిన్నకారు రైతులను బెదిరించి, అధికారుల సహకారంతో రికార్డులు మార్చేసి భూములను లాగేసుకున్నారు. బతికుండగానే వారిని మానసికంగా, ఆర్థికంగా చంపేశారు. ఇప్పటికీ పలువురు జీవచ్ఛవాలుగా ఉన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో జరిగిన భూదందా వ్యవహారాలను పరిశీలిస్తే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు విషయంలో టీడీపీ, దాని అను'కుల' పచ్చమీడియా ఎందుకంత రాద్ధాంతం చేస్తుందో తేటతెల్లమవుతుంది.

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: చిన్న, సన్నకారు, పేద రైతుల భూములను లాగేసుకోవడం ఎలాగో తెలుసుకోవాలంటే గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామాన్ని సందర్శించాలి. ప్రభుత్వ ఆస్తులను తమ ఆస్తులుగా రికార్డుల్లోకి ఎక్కించుకుని వాటినే ప్రభుత్వానికి ఇచ్చేసి లబ్ధి పొందడం ఎలాగో అవగాహనకు రావాలన్నా ఈ గ్రామాన్నే మోడల్‌గా ఎంచుకోవాలి. కానీ ఇలాంటి దుర్మార్గాలు చోటుచేసుకోవాలంటే చంద్రబాబునాయుడు అధికారంలో ఉండాలి. తిమ్మిని బమ్మిని చేయాలన్నా, నిజాన్ని అబద్ధంగా చెప్పాలన్నా, అబద్ధాన్ని నిజంగా నమ్మించాలన్నా పచ్చమీడియా తోడుగా బాబుకే సాధ్యం. తను, తన సామాజికవర్గం రియల్ వ్యాపారానికి, అడ్డదిడ్డంగా సొమ్ము చేసుకోవడానికి, నిస్సిగ్గుగా ప్రపంచ స్థాయి రాజధానిగా 'అమరావతి' ఎదుగుతుందంటూ తప్పుడు ప్రచారం సాగించిన ప్రాంతంలో ఎన్నెన్ని భూఅక్రమాలో, దుర్మార్గాలో.



నెక్కల్లు గ్రామ ముఖ ద్వారం

నెక్కల్లుపై ఓ లుక్కేయాల్సిందే...

- రాజధాని అమరావతి పేరిట జరిగిన భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)లో సర్వే సమయంలోనే అనేక మోసాలు చోటుచేసుకున్నాయి. ఆయా గ్రామాల్లోని స్థానిక నాయకులు, వారి ఎమ్మెల్యే మొదలు ఆనాటి ప్రభుత్వ పెద్దల వరకు ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్డ్, దేవదాయ, వక్ఫ్ ఆస్తులతోపాటు వాగులు, వంకలు, కుంటలు, చెరువులు, చేద బావులు, రోడ్లు, చివరకు శ్మశాన స్థలాలను తమ పేరిట కలిపేసుకుని లబ్ధి పొందారు.
- పేదలకు చెందిన ఒక ఎకరంలో రెండు నుంచి 70 సెంట్ల వరకు సర్వేలో అక్రమంగా తగ్గించేసి బాబు సామాజిక వర్గానికి చెందిన స్థానిక నాయకులు కలిపేసుకున్నారు. వారికి అప్పటి సీఆర్‌డీఏ అధికారులు, టీడీపీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, అధిష్టానం పెద్దలు తోడయ్యారు. రాజధాని నిర్మాణానికి తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల్లోని 29 గ్రామాల్లో వేలాది ఎకరాల భూసమీకరణ చేపట్టిన సంగతి తెలిసిందే. ల్యాండ్ పూలింగ్‌కు భూమి ఇవ్వకపోతే అది అలాగే మిగిలిపోతుంది. ఎందుకూ పనికిరాదు. ఎలాగైనా ప్రభుత్వం లాగేసుకుంటుందని బెదిరించారు. సీఆర్‌డీఏ పర్యవేక్షణలో నెక్కల్లులో జరిగిన సర్వేల్లో మోసాలు కోకొల్లలు. ఇలాంటి పరిస్థితులే ఇతర గ్రామాల్లోనూ లెక్కకు మిక్కిలి జరిగాయి.
- బీసీ సామాజికవర్గానికి చెందిన గుమ్మా సదాశివరావుకు సర్వే నెంబరు 157బీలో 1.41 ఎకరాలు ఉండగా 1.32 ఎకరాలు మాత్రమే ఉందని తేల్చారు. అదే సర్వే నెంబరులో గుమ్మా కాటంరాజుకు 1.41 ఎకరాలు ఉండగా 97 సెంట్లు మాత్రమే ఉందని నిర్ధారించారు. వీరిద్దరికి 2.82 ఎకరాలలో 51 సెంట్లు లేనట్లు తేల్చేశారు.
- అలాగే మాడపాటి వీరరాఘవయ్యకు 14 సెంట్లు, తాటి పాండురంగారావుకు 26 సెంట్లకు కోతపడింది. గుమ్మా బుల్లిబాబు, ముప్పూరి వెంకటేశ్వరరావు, మాపూరి నరసింహారావు... ఇలా నెక్కల్లుకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన దాదాపు 30కి పైగా కుటుంబాల వారికి భూ విస్తీర్ణంలో మోసం జరిగింది.

రావెలతోపాటు అధికారిపై కేసు, అరెస్టు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అక్రమాలు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్కటిగా బయటకు రావడం ఆరంభమయ్యాయి. 'సాక్షి' సాక్ష్యాలతో వెలుగులోకి తెచ్చింది. పేదల ఫిర్యాదులతో కేసులు నమోదు చేసి విచారించడంతో అనేక దురాగతాలు వెలుగుచూశాయి. టీడీపీ నాయకుడు రావెల గోపాలకృష్ణకు, ఇతరులకు తప్పుడు రికార్డులు సృష్టించి సహకరించిన అప్పటి సీఆర్‌డీఏ నెక్కల్లు డిప్యూటీ కలెక్టర్ మాధురిని పోలీసులు అరెస్టు చేశారు. వేలాది చదరపు గజాల ప్లాట్లను కేటాయించడం, రూ.5.26 లక్షల కౌలు చెల్లించడాన్ని పోలీసులు గుర్తించడంతో ఆమెకు అప్పట్లో 14 రోజులు రిమాండ్‌ను జడ్జి విధించారు.

టీడీపీ నేత రావెల గోపాలకృష్ణకు

అమరావతి రాజధాని ప్రకటనకు ముందు నెక్కల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రావెల గోపాలకృష్ణకు ఉన్న వాస్తవ భూమికి, ఆ తరువాత ఆయన ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చిన భూ విస్తీర్ణానికి చాలా తేడా ఉండటాన్ని గ్రామస్తులు రికార్డులను తొలుత పరిశీలించి తెలుసుకున్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలకు చెందిన భూముల వాస్తవ విస్తీర్ణం తగ్గి రావెలకు 3.11 ఎకరాలు ఒక ఖాతాలోనే పెరగడాన్ని గుర్తించారు. తమకు జరిగిన మోసాలను తుళ్లూరు తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లడంతో పోలీస్ కేసు కూడా రావెలపై నమోదైంది. ఈయనకు అప్పటి తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సహకారం మెండుగా ఉంది. రావెలతోపాటు ఆయన బంధువులకు, సామాజికవర్గానికి చెందిన వారికి సైతం పేదల భూమి దక్కేలా అధికారులు వ్యవహరించారు. వివిధ సర్వే నెంబర్లలోని 4.59 ఎకరాలను పేదలకు తగ్గించేసి రామినేని మల్లేశ్వరి, రామినేని సుబ్బారావు, రామినేని మురళి, కాకా రాఘవయ్య, వై.వెంకటరావులకు రాసిచ్చేశారు.

చెక్‌డ్యాం, కుంట, చెరువు, రోడ్డు...

ఏదైనా ఆక్రమణే

- నెక్కల్లులోని స.నెం: 54లో నిర్మితమైన చెక్ డ్యాంకు చెందిన 1.24 ఎకరాలు పరులపాలైంది.
- స.నెం:159లోని కోమటిగుంట (చిన్నచెరువు)కు చెందిన 77 సెంట్లను పూలింగ్ కింద ఇచ్చి ప్లాట్లను పొందారు.
- స.నెం: 162లో కొండవాగు పరిధిలోని 93 సెంట్లను ఆక్రమించి భూ సమీకరణ కింద ఇచ్చేశారు.
- స.నెం: 105లో రోడ్డు (బొమ్మలరోడ్డు)ఉంది. 1.15 ఎకరాలను డి.కె.పట్టాగా పొంది పూలింగ్‌కు ఇచ్చేశారు.
- స.నెం: 88లో గ్రామ ఊరచెరువు ఉంది. ఇందులో 31.50 సెంట్లు చేజిక్కించుకుని పూలింగ్ కింద ఇచ్చి లబ్ధి పొందారు. ఇలాంటివి వెలుగులోకి రానివి ఉన్నాయని గ్రామస్తులు 'సాక్షి'కి వివరించారు.

- నెక్కల్లులో బీసీ వర్గానికి చెందిన 83 సంవత్సరాల గంగారపు రత్తమ్మ, 76 ఏళ్ల బడిగంచుల కొండమ్మ స్వయానా అక్కచెల్లెళ్లు. సర్వేనెంబరు 164డి లో ఒక్కొక్కరికి 1.10 ఎకరాలు చొప్పున ఇద్దరికి 2.20 ఎకరాలు ఉంది. సర్వే నెంబరు 163లో పదేసి సెంట్లు చొప్పున ఇరువురికి 20 సెంట్లు ఉంది. మొత్తం వెరసి 2.40 ఎకరాలలో 91 సెంట్లను సర్వే సమయంలో తగ్గించేశారు.
- గుమ్మా సీతారావమ్మ (80) కు స.నెం: 133లో ఎకరం ఉండగా 82 సెంట్లు, 160సిలో 56 సెంట్లకుగాను 50, 166లో రెండు సెంట్లు తగ్గించిన అధికారులు మొత్తంగా 26 సెంట్లు కోత వేశారు. భూ విస్తీర్ణం తగ్గిపోయిందనే మనోవేదనతో తన తల్లి గుండె ఆగి చనిపోయిందని గుమ్మా వెంకట్రావు వాపోయారు. బీసీ వర్గానికి చెందిన తమ మాటలు ఎవరి చెవికెక్కలేదని వాపోయారు.
- 80 ఏళ్ల పూజల శేషగిరిరావు కుమారుడు రామాంజనేయులుకు 127 సర్వే నెంబరులో ఎకరం పొలం ఉండగా 43 సెంట్లు మాత్రమే ఉందన్నారు. 160లో 1.10 ఎకరాలకు రెండు సెంట్లు తగ్గించేశారు. ఆయనకు 45 సెంట్లు లేదని స్పష్టంచేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తహసీల్దారు ద్వారా తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు (80/2020) నమోదైంది.

గ్రామేతరులకు అసైన్డ్ భూములు

- నెక్కలు గ్రామ పరిధిలోని నిరుపేదలకు గతంలో ఇచ్చిన అసైన్డ్ భూములను స్థానిక టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కయి ఇతర మండలాల వారికి రాసిచ్చేసి పెద్దమొత్తాలను రాబట్టుకున్నారని బాధితులు సాక్షి ఎదుట వాపోయారు.
- నెక్కలు స.నెం:162లో 92 సెంట్లను కాజ గ్రామానికి చెందిన సాంబయ్యకు, అదే స.నెం :లో 93 సెంట్లను పొన్నెకల్లుకు చెందిన ఎం.బ్రహ్మంకు రాసిచ్చారు.
- కాజకు చెందిన ఎ.సాంబశివరావుకు స.నెం: 105లో 1.1 ఎకరం, ఎ.వెంకయ్యకు స.నెం :162లో 92 సెంట్లు, శ్రీనివాసరావుకు 54/2లో 75 సెంట్లు, 76 సెంట్లు, 159లో 77 సెంట్లు, 106లో వెంకటరమణకు ఎకరం, 159లో కె.రమణకుమారికి ఎకరం, 105లో 1.15 ఎకరాలు ఆర్.శ్రీనివాసరావుకు స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు కలిసి ధారాదత్తం చేశారు.

- గిరి దుర్గం అభివృద్ధికి తొలి సంతకం చేసిన వైఎస్సార్
- సీఎం జగన్ ప్రభుత్వంలో పర్యాటకం ప్రగతి పరుగులు
- చారిత్రక ప్రాంతంగా శత్రు దుర్భేద్య రాజ్యం
- జల, సాహస క్రీడాలకు ప్రాధాన్యం
- పర్యాటకంలో పల్నాడు జిల్లాకు మణిహారం



పచ్చని చీరను చుట్టుకున్న కొండవీడు ప్రాంతం

కొండవీడు.. ఇదిగో..మార్పు

అభివృద్ధి చూడు

ప్రాభవానికి వెలుగు రవ్వలు

యడ్లపాడు: కొండవీడు సహజ సిద్ధ ప్రకృతి అందాల నిలయం. పర్యాటక ప్రేమికుల హృదయాల్ని దోచే చారిత్రక ప్రదేశం. దశాబ్దాల తరబడి పాలకుల నిరాదరణకు గురైంది. గుప్త నిధుల కోసం దుండగుల బారిన పడింది. విలువైన జాతి సంపద, అపారమైన కళా ఖండాలు, ప్రాచీన కట్టడాలు ఎన్నో ధ్వంసమయ్యాయి. అద్దంకి రెడ్డి రాజుల రెండో రాజధానిగా వందేళ్లకు పైగా వర్ధిల్లిన ఈ గిరి దుర్గం పైకి చేరుకోవాలంటే కోట గ్రామం వైపు.. నాడు రాజులు భారీ రాళ్లతో నిర్మించిన మెట్ల మార్గమే శరణ్యమైంది. దీంతో కొండవీడుపై ఆసక్తి ఉన్న యువకులు తప్పా ఇతరులు పైకి వెళ్లి వీక్షించలేని పరిస్థితి నెలకొంది. తెలుగు వారి రాచరిక పాలన వైభవానికి సజీవ సాక్ష్యం కొండవీడును గొప్ప పర్యాటక కేంద్రంగా రూపొందించాలని కలలుగన్న ఏకైక నేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. తండ్రి ఆశయాన్ని సాకారం చేస్తూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరింత అభివృద్ధి చేసి పర్యాటక ప్రేమికులకు చేరువ చేశారు. వైఎస్సార్ హయాంలో నేటి ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జగన్ హయాంలో మంత్రి విడదల రజిని కొండవీడు అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి

- ప్రారంభంలో చెక్ పోస్టు, నగరవనం పేరిట ఏటా ఇస్తున్న నిధులతో నైట్ క్యాంపు పది వరకు గుడారాలు, సోలార్ విద్యుద్దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.
- మెలికలు తిరిగిన ఘాట్ రోడ్లు, సునాయాసంగా ప్రయాణించే సుందర మార్గాలు, అడుగడుగున సూచికలు, ప్రతి కట్టడం వద్ద దాని చరిత్ర, విశిష్టత తెలిపే బోర్డులు ఏర్పాటు చేశారు.
- సెల్ఫీలకు చెరువులో డెక్, చిల్డ్రన్స్ పార్కు, వెహికల్ పార్కింగ్ సౌకర్యం, శత్రు దుర్భేద్య చరితను తెలిపే థీమ్ పార్కు సుందరంగా తీర్చిదిద్దారు.
- యువత అమితంగా ఇష్టపడే సాహస క్రీడలు, సుదూర ప్రాంతాలు, ఏటవాలు కొండలు, లోయల్ని చూపే 'వ్యూ'పాయింట్స్, ప్రకృతి దేవత ప్రేమగా ఆహ్వానిస్తున్నట్లుండే స్వాగత ద్వారం నిర్మించారు.
- సేద తీరేందుకు షెల్టర్స్, గజబోల, బెంచీలు, భోజన శాలలు, తాగునీరు, మరుగు దొడ్ల సౌకర్యం కల్పించారు.
- కొండపై హార్స్ రైడింగ్‌కి రెండు గుర్రాలు, పుట్టాలమ్మ, ముత్యాలమ్మ చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్, వెదుళ్ల చెరువులో కయాకింగ్ బోటింగ్, ఫిషరింగ్ టూల్స్ అందుబాటులోకి తెచ్చారు.
- కొండవీటి రాజు అనపోతారెడ్డి భారీ కాంస్య విగ్రహం, విశ్వకవి యోగివేమన విగ్రహం, చారిత్రక అంశాలు తెలిపే గైడెన్స్ గ్యాలరీ తీర్చిదిద్దారు.
- పచ్చదనం పంచే మొక్కలు, పూలు, పలు ఔషధ, అరుదైన మొక్కల పెంపకం చేపట్టారు.
- వీకెండ్స్, పండగ సమయాల్లో ఎంటర్‌టైనింగ్, ఫన్ గేమ్స్, కల్చరల్ యాక్టివిటీస్‌ను నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో వివిధ శాఖల ద్వారా మరిన్ని ప్రాజెక్టులు తీసుకువచ్చేలా నివేదికలను రూపొందించడం జరిగింది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొండవీడుకు విడుదలైన నిధులు

కొండవీడు రెండో దశ ఘాట్ రోడ్డుకు రూ.11.5 కోట్లు	వేములూరుపాడు వయా కొత్తపాలెం అప్రోచ్ మార్గానికి రూ.6 కోట్లు
డీఎస్ సాలస ఫిరంగిపురం అప్రోచ్ మార్గానికి రూ.4.30 కోట్లు	రెండో దశ ఘాట్ రోడ్డుకు రూ.11.50 కోట్లు

అటవీ శాఖ కొండవీడు – నగర వనం కింద	
2019-20	: రూ. 1,17,00,000
2020-21	: రూ. 36,63,000
2021-22	: రూ.1,43,00,000
2022-23	: రూ. 92,75,000

జగనన్న హయాంలో ప్రగతి పరుగులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కొండవీడు ప్రగతి పట్టాలపై పరుగులు తీసింది. 2022 జనవరి 8న రూ.13.35 కోట్లు మంజూరయ్యాయి. కొండపై నుంచి ప్రాచీన కట్టడాల వరకు కీలకమైన రెండో దశ ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని వేగంగా ప్రభుత్వం పూర్తి చేసింది. అటవీ, ఆర్ అండ్ బీ, దేవదాయ, పర్యాటక, పురావస్తు తదితర శాఖల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న వివిధ ప్రాజెక్టులు సందర్శకులను బాగా ఆకట్టుకుంటున్నాయి. కొండవీడు -నగర వనం పేరిట గతేడాది వరకు రూ.15 కోట్లకు పైగా నిధులు విడుదల చేసి, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను కొండపై సమకూర్చారు. జల, సాహస క్రీడల్ని ప్రోత్సహిస్తూ పలు ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చారు.

గిరి దుర్గం అభివృద్ధికి తొలి సంతకం చేసిన వైఎస్సార్

కొండ పైకి ఘాట్ రోడ్డు నిర్మించాలని అసెంబ్లీలో చర్చించి 2005లో ఆర్ అండ్ బీకి రూ.5 కోట్లు విడుదల చేసి, సీఎంగా వైఎస్సార్ కొండవీడు అభివృద్ధిపై తొలి సంతకం చేశారు. అంతా రిజర్వ్ ఫారెస్టు కావడంతో కేంద్ర అటవీ శాఖ అనుమతులను తీసుకున్నారు. అభివృద్ధికి వినియోగించే భూములకు సరి సమానంగా రెవెన్యూ భూముల్ని అటవీ శాఖకు అప్పగించారు. జంగిల్ క్లియరెన్స్, సర్వేలు, ట్రాక్ రోడ్ ఏర్పాటు చేశారు. తర్వాత తొమ్మిది శాఖలను సమన్వయం చేసి ఘాట్ రోడ్డుకు రూ.32 కోట్లు మంజూరు చేశారు. మహా నేత మరణం, రాష్ట్ర విభజన నేపథ్యంలో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది. టీడీపీ హయాంలో తొలి దశ ఘాట్ రోడ్డు పనులను మాత్రమే పూర్తి చేయగలిగారు.



కొండపైకి సులువైన మార్గం ఘాట్ రోడ్డు -2 ఇదే

అట్టహాసంగా కొండవీడు ఫెస్ట్...

ఈ ఏడాది ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో కొండవీడు ఫెస్ట్-2024 పేరిట రెండు రోజుల ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించి, గిరిదుర్గ కీర్తిని దశదిశలా వ్యాప్తి చేశారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు ఇతర శాఖలను సమన్వయం చేసుకుని ఫెస్ట్ దిగ్విజయం అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఇదే నెల 29న కొండపై ఉన్న పురాతన లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రూ.45.60 లక్షలతో పునరుద్ధరణ చేశారు. భక్తుల సౌకర్యాలకు రూ.30 లక్షలు, ప్రతిష్ఠ కార్యక్రమానికి మరో రూ.4 లక్షలు ప్రభుత్వం వెచ్చించింది. ఈ ఆలయ నిర్వహణకు నరసరావుపేట మండలంలోని కోటప్ప కొండ త్రికోటేశ్వర స్వామి ఆలయం నిధులతో ఏడాది ప్రతి నెలా రూ.50 వేల చొప్పున ఆర్థిక సహకారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గోల్కొండ గ్రూప్స్ అధినేత నడికట్టు రామిరెడ్డి సహకారంతో రూ.7 లక్షలతో కొండపై చెత్త సేకరణ వాహనం ఏర్పాటు చేశారు.



కొండపై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం (ఫైల్)

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)
Editor: V. Murali, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.